క్లుప్తంగా

జాబ్‌మేళా విజయవంతం



జాబ్‌మేళా నిర్వహిస్తున్న దృశ్యం

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. సోమవారం నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో దివిస్ ల్యాబొరేటరీస్ ఇంటర్వ్యూలకు 65 మంది హాజరుకాగా 46 మంది షార్ట్ లిస్ట్ అయినట్లు ప్రిన్సిపాల్ ఉషశ్రీ తెలిపారు.ఫైనల్‌గా ఎంపికైన అభ్యర్థుల వివరాలు ఈ నెల 31న తెలియచేస్తామని కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ చెప్పారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డా.గొల్ల శ్రీను, జేకేసీ కోఆర్డినేటర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఫుడ్ కమిషన్ సభ్యుల పర్యటన

పార్వతీపురం టౌన్: జిల్లాలో స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు పర్యటిస్తున్నట్లు ఇన్‌చార్జ్ జేసీ హేమలత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన బుధవా రం రాత్రి జిల్లాకు చేరుకుని బస చేయనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటన చేపడతారని తెలిపారు.

ప్రభమానుకు మాజీ డిప్యూటీ సీఎం ప్రత్యేక పూజలు



ప్రభమానుకు ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణంలో శ్యామలాంబ అమ్మవారి పండగ నేపథ్యంలో మెంటాడ వీధి వద్ద ప్రభమానును మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ప్రభమానుకు ప్రత్యేక పూజలు చేశారు. రాజన్నదొర వెంట పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వండి



ఐటీడీఏపీఓ అశుతోష్ శ్రీవాత్సవకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సివిల్స్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు జె. బంగారు రాజు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి



ఉపాధిహామీ పనులు కల్పించాలని కోరుతున్న పెదపథం పంచాయతీ ప్రజలు

సాలూరు: మండలంలోని పెదపథం పంచాయతీలోని పలు గ్రామాల ప్రజలకు ఉపాధిహామీ పనులు కల్పించడం లేదని తెలియవస్తోంది. ఈ మేరకు పెదపథం, పాలికవలస, దుక్కడవలస, బాగువలసలలో పలువురు పలువురు ప్రజలు ఉపాధిహామీ పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అసలు తమకు ఎందుకు పనులు కల్పించడం లేదో అర్థం కావడం లేదని వాపోతున్నారు. పని కల్పించండని పలుమార్లు ఉపాధిహామీ సిబ్బంది, అధికారులను అడుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు.ఇకనైనా అధికారులు స్పందించి తమకు ఉపాధిపనులు కల్పించాలని కోరుతున్నారు.

పాఠశాల విద్యార్థులకు ప్లేట్ల వితరణ

బలిజిపేట: మండలంలోని తుమరాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 30ప్లేట్లను వితరణగా అందేశారు. గ్రామానికి చెందిన పెదిరెడ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం వారి కుమారుడు, పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటరమణ, భార్య ఉమ విద్యార్థులకు ప్లేట్లు సోమవారం పాఠశాలలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆక్రందనే.. యువత పోరు

- విద్యార్థులను, యువతను కూటమి ప్రభుత్వం మోసగించింది
- ఉద్యోగాల కల్పనా లేదు.. నిరుద్యోగ భృతీ లేదు?
- ఫీజులు కట్టలేక తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు
- అందరి తరఫున ప్రభుత్వ వైఖరిని నిలదీస్తాం
- యువత పోరు పోస్టర్లు ఆవిష్కరించిన మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురంలో 'యువత పోరు'పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, పార్టీ శ్రేణులు

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం టౌన్/సాలూరు రూరల్ : 'అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామని కూటమి నాయకులు హామీలిచ్చారు. అంతవరకూ నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు చొప్పున భృతి ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న ఉద్యోగాలు తీసేయడం తప్ప.. కొత్తగా ఒక ప్రభుత్వ ఉద్యోగమైనా కల్పించారా? పది నెలలవుతోంది. ఒక్కరికైనా నిరుద్యోగ భృతి ఇచ్చారా? అయిదు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన కింద రూ.4,600 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడిస్తారని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, పార్వతీపురం, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించేందుకు, నిరుపేదలకు మంచి వైద్యం కల్పించేందుకు గత ప్రభుత్వం .. 17 ప్రభుత్వ వైద్యకళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే.. వాటి మీదా కక్షగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త వైద్యకళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తున్నారని తెలిపారు. పార్వతీపురంలో మెడికల్ కాలేజీ భవిష్యత్తు ఏమిటో తెలియకుండా చేశారని వాపోయారు. రాష్ట్రంలో యువతను, నిరుద్యోగులను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని నిలదీసేందుకు తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 12వ తేదీన 'యువత పోరు' కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. ఆ రోజున జిల్లా కేంద్రంలో యువతతో కలిసి నిరసన చేపట్టడంతోపాటు.. వినతిపత్రాలను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కార్యక్రమం నిర్వహణకు సంబంధించి నియోజక వర్గ నాయకులతో కలిసి సాలూరు, పార్వతీపురంలలో 'యువత పోరు' పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, యువత, నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. 12వ తేదీన ఉదయం 10 గంటలకు పార్వతీపురం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకోనున్నామని చెప్పారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములునాయుడు, పార్వతీపురం అర్బన్, మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొమ్మి రమేష్, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ షఫీ, రాష్ట్ర పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం ఉప కార్యదర్శి సిద్ధా జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు వద్దు

విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవద్దని ఫీజురీఇంబర్స్‌మెంట్ ఇస్తామని ఇంతవరకు చెల్లించకుండా విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తున్న కూటమి ప్రభుత్వ తీరుపై మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సాలూరులో విలేకరులతో మాట్లాడారు.

బకాయిల కోసం తల్లుల ఎదురుచూపులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మాయమాటలు నమ్మి నిరుద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులు దారుణంగా మోసపోయారని నేతలు పేర్కొన్నారు. గత ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు అమలు కాని హామీలిచ్చారని.. అధికారం కోసం సూపర్‌సిక్స్ పేరుతో దగా చేశారని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి కింద యువతీయువకులకు నెలకు రూ.3 వేలు చొప్పున ఇస్తామన్నారని గుర్తు చేశారు. సుమారు 20 లక్షల మందికి, నెలకు రూ.600 కోట్ల మేర ప్రభుత్వం బకాయి పడిందని చెప్పారు. 'తల్లికి వందనమన్నారు.. ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఇస్తామన్నారు. విద్యాదీవెన, వసతిదీవెన కింద రూ.12 వేల కోట్లు బకాయిపడ్డారు. చదువుకునే పిల్లల తల్లిదండ్రులైతే తల్లికి వందనం, విద్యాదీవెన, వసతిదీవెన కోసం ఎదురుచూస్తున్నారు. ఫీజులు కట్టలేని పరిస్థితిలో ఉన్నారు. విద్యార్థులను అర్ధాంతరంగా కళాశాలల నుంచి ఆయా యాజమాన్యాలు పంపించేస్తున్నాయ'ని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట వేసి, నాడు–నేడు కింద అన్ని పాఠశాలలూ బాగు చేశామని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించామని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రభుత్వ విద్యను కూటమి సర్కారు నిర్వీర్యం చేస్తోందని తెలిపారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర

సూపర్ సిక్స్ హామీ అయిన ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడని మహిళలు ప్రశ్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. అసలు పథకంపై స్పష్టత ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. 'ఉచిత ప్రయాణం జిల్లా వరకే పరిమితమని.. ఇక్కడ మంత్రి అంటున్నారు. రేపు ఇంకొకరు వచ్చి మండలానికో, గ్రామానికో పరిమితమని అంటారు. ప్రజలను మభ్యపెట్టడానికే సూపర్ సిక్స్ పథకాలను తెచ్చార'ని విమర్శించారు. రాష్ట్రంలో 10 లక్షల పింఛన్లను తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని, బడ్జెట్‌లో పింఛన్ మొత్తాలకు కోత వేశారని.. అన్నదాత సుఖీభవ కింద ఇస్తానన్న రూ.20 వేలు ఏదని ప్రశ్నించారు.

మహిళలు అడుగుతున్నారు.. ఏ బస్సు ఎక్కాలని?

'చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి గత ప్రభుత్వంపై కక్ష ఉంటే.. జగన్‌పైనో, లేదంటే మాలాంటి వారిపైనో చూపించుకోవాలి. ప్రజల కోసం ఎన్ని కేసులైనా, ఇంకెన్ని బెదిరింపులైనా భరిస్తాం. అంతేగానీ.. పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఏం చేశార'ని రాజన్నదొర, జోగారావు ప్రశ్నించారు. చంద్రబాబు ఊసరవెల్లి ఆలోచనలు మానుకోవాలన్నారు. పేద విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అంతవరకూ రాష్ట్ర యువత తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువత రోడ్డు మీదకు వచ్చి.. కూటమి పాలనను ఎండగట్టనున్నారని తెలిపారు. అందుకు ఈ నెల 12న 'యువత పోరు' చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, నిరుద్యోగ యువత అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులపై కక్ష ఎందుకు?

సావిత్రిబాయికి నివాళులు



పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న యువకులు

బలిజిపేట: సావిత్రిబాయి మంచి సంఘ సంస్కర్త అని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతిని పెదపెంకిలోని నేతాజీ గ్రంథాలయం వద్ద కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి మహిళగా సావిత్రి బాయికి గుర్తింపు ఉందన్నారు. ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు అమె అని చెప్పారు. కార్యక్రమంలో జేపీరాయ్ గురు, కె.నారాయణరావు, శంకర్, జి.శ్రావణ్‌కుమార్, బి.హర్షకుమార్, టి.శివ, ఆర్.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పండుగలో మరో అడుగు



ఊరేగింపులో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సాలూరు: పట్టణంలో ఈ ఏడాది మే నెలలో జరగనున్న సాలూరు ఇలవేల్పు శ్రీశ్యామలాంబ అమ్మవారి పండగ ఏర్పాట్లలో మరో అడుగు ముందుకు పడింది. పండగ నేపథ్యంలో ప్రభను తయారు సేందుకు చెట్టును ఎడ్ల బండ్లపై ఊరేగించి స్థానిక మెంటాడ వీధికి తరలించారు. ఈ క్రమంలో భక్తులు తరలివచ్చి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో యువత పాల్గొని సందడి చేశారు. దీంతో స్థానికంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

హిందువులపై దాడికి ఖండన



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

పార్వతీపురం టౌన్: హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామని విశ్వహిందూ పరిషత్ నాయకులు అన్నారు. ఈ మేరకు విశ్వహిందూ పరిషత్, అనుబంధ సంస్థలు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయిచోటిలో ఈనెల 4న జరిగిన వీరభద్రస్వామి ఆలయ పార్వేటి ఉత్సవం సందర్భంగా భక్తులు ఊరేగింపు చేస్తున్న సమయంలో ముస్లింలు హిందువులపై దాడి చేశారన్నారు. ఈ సందర్భంగా పోలీసులు ముస్లింలను అదుపులోకి తీసుకోవడంలో విఫలమవడమే కాకుండా పక్షపాత ధోరణితో హిందువులపై అమానుషంగా లాఠీచార్జీ చేసి తీవ్రంగా గాయపరిచారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాయిచోటి ఎస్సై హిందువులపై తప్పుడు కేసులు బనాయించడాన్ని ఖండిస్తున్నామన్నారు. హిందువులపై దాడులు చేస్తూ రెచ్చ గొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చింత భాస్కరనాయుడు, ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిన్నారావు, ఆర్ఎస్ఎస్ ఇన్‌చార్జి నర్సింగరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, కె.జగన్నాథరావు, ఎ.బాబూరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జీడికి మద్దతు ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



తహసీల్దార్ ఎన్‌వీరమణకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సాలూరు: జీడిపంటకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సీదరపు అప్పారావు, సుందరరావు, జానకిరావులు కోరారు.ఈ మేరకు సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎన్‌వీరమణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలో సుమారు 4వేల మంది రైతులు, 5,500 ఎకరాల్లో జీడి పంట సాగు చేస్తున్నారని తెలిపారు. ఎకరాకు 250 కిలోల చొప్పున దిగుబడి వస్తుందని, పండిన పంటను గిరిజనుల నుంచి దళారులు, వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోందని వాపోయారు. దీనివల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీడి పంటకు కనీస మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని కురుకూటి, వెలగవలసలో జీడిప్రాసెసింగ్ సెంటర్లు ప్రారంభిస్తామని అధికారులు ప్రకటించి ఏడాది దాటుతున్నా పరిశ్రమలు ప్రారంభం కాలేదన్నారు. ఇకనైనా ఈ ప్రాసెసింగ్ సెంటర్లు ప్రారంభించి గిరిజన యువతీయువకులకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జోగయ్య, రాము, అయోధ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భూమి సమస్యను పరిష్కరించాలి

- గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న బాధితులు

సీతానగరం: మండలంలోని చినబోగిలిలో భూమి ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు చినభోగిలి గ్రామస్తులు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లబ్ధిదారులు మాట్లాడుతూ చినభోగిలిలో 190/3 సర్వే నంబర్‌లో 36 సెంట్ల భూమిని ఆక్రమించుకుని ఇతరులు అక్రమంగా విక్రయాలు నిర్వహించారని ఆరోపించారు. ఆక్రమించిన భూమిలో కంచె వేయడంతో తమ భూమిని ఎవరో ఆక్రమించారని కుటుంబీకులు తెలియజేయడం వల్ల మా రికార్డులను పరిశీలించి భూమిని తక్షణమే వారి నుంచి అప్పగించాలని కోరుతున్నామన్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో భూమి వారసులు గర్భాపు కమల, బోనెల ప్రమీల పొట్నూరు జయరావు ఉన్నారు.

మినీ గోశాలలో అక్రమాలపై విచారణ చేపట్టండి

పార్వతీపురంటౌన్: మినీ గోశాలల్లో అక్రమాలపై విచారణ చేపట్టాలని జియమ్మవలస మండలం చింతల బెలగాం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న మినీ గోశాల పథకంలో పశువులు ఉండి గోశాలను కావాలనుకున్న రైతులకు మంజూరు చేయలేదని, పశువులు లేని రైతులు పక్క రైతుల పశువులు చూపి ఫొటోలు తీయించి అక్రమంగా గోశాలలు మంజూరు చేయించుకుని లబ్ధిపొందుతున్నారని ఆరోపించారు. కొంతమంది అధికార పార్టీ నాయకులు తమ స్వార్థంతో అధికారులను బెదిరించి మంజూరు చేయించారని, తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



కలెక్టరేట్ వద్ద తమ సమస్యను తెలుపుకోవడానికి వచ్చిన సర్వపాడు గ్రామస్తులు

పార్వతీపురంటౌన్: తమ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కొమరాడ మండలం చినఖేర్జల పంచాయతీ సర్వపాడు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో 150 కుటుంబాలు ఉన్నాయని, గ్రామానికి ఒక వాటర్ ట్యాంక్ ఉందని, దాని వల్ల ఎటువంటి ఉపయోగం లేదని వాపోయారు. వాటర్ ట్యాంక్‌లో నీరు నింపడానికి బోరు నీరు సరిపోవడం లేదన్నారు. ఉన్న బోరు కూడా సరిగ్గా పనిచేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న వేసవి దృష్ట్యా ఈ సమస్యలు పరిష్కరించి తమ గ్రామానికి తాగు నీటిని అందజేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పువ్వల నాగేష్, కె.రామప్ప, కె.రమేష్, జె.మధు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలకు యూబీఐ ఫర్నిచర్ వితరణ



ఎక్స్‌రే మెషీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో వినియోగానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫర్నిచర్‌ను వితరణగా అందజేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కార్పొరేషన్ సామాజిక బాధ్యత కింద రూ.లక్ష విలువైన నాలుగు బీరువాలు, నాలుగు టేబుల్స్, నాలుగు విజిటింగ్ చైర్లు, 20 కుర్చీలను అందజేసినట్లు చెప్పారు. యూబీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ ఆధ్వర్యంలో సోమవారం ఫర్నిచర్ వితరణ గావించారు. వసతిగృహాలకు ఫర్నిచర్ అందజేయడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.

రోగుల చెంతకే ఎక్స్‌రే మిషన్

గిరిజన ప్రాంతాల్లోని క్షయవ్యాధి రోగుల చెంతకే సంచార ఎక్స్‌రే మిషన్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విరాళంగా అందించిన సంచార ఎక్స్‌రే మెషీన్ యూనిట్‌ను కలెక్టర్ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో క్షయవ్యాధి గ్రస్తులు ఎక్కువగా ఉన్నారని, అటువంటి వారందరూ ఇకపై ఎక్స్‌రే కోసం పార్వతీపురం ప్రభుత్వ ఆస్పత్రికి రావలసిన అవసరం లేదని, ఈ మిషన్ ద్వారా రోగుల ఇంటి వద్దనే ఎక్స్ రే తీసుకునే సౌలభ్యం అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. రూ.30 లక్షల విలువగల ఈ యూనిట్‌ను షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కమాండర్ వై.ఫణీంద్ర విరాళంగా అందజేశారని కలెక్టర్ ఈ సందర్భంగా తెలియజేస్తూ, ఆయనకు అభినందనలు తెలిపారు.

రబీపంటను ఎఫ్‌ఆర్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలి

సీతానగరం: మండలంలో నీటివనరులున్న గ్రామాల్లో రబీ పంటసాగు చేస్తున్న రైతులు ఏపీ ఎఫ్ఆర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు పణుకుపేట రైతుసేవా కేంద్రంలో సోమవారం రబీపంట నమోదు, సామాజికతనిఖీలో భాగంగా ఖరీఫ్ పంట నమోదుప్రక్రియను రైతుల సమక్షంలో రైతులు వేసిన పంట విస్తీర్ణం, చదివి వినిపించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బంకురు పద్మవతి, రైతు నాయకులు శ్రీహరినాయుడు, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

పార్వతీపురం రూరల్: మండలంలోని బాలగుడబ గ్రామంలో ఉన్న తూర్పుకోనేరు చెరువు గట్టుచుట్టూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు గ్రామస్తులకు అవగాహన కోసం స్లోగన్స్ బోర్డులను గ్రామ యువత ఏర్పాటు చేశారు. సోమవారం గ్రామంలో పలు కూడళ్లవద్ద చెత్తాచెదారాలు వేయకుండా ఉండేందుకు మరికొన్ని చోట్ల బోర్డులను ఏర్పాటు చేసినట్లు యువత పేర్కొన్నారు. కలెక్టర్ పిలుపుమేరకు ఈ కార్యక్రమాలు తాము చేపట్టినట్లు యువత తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తికి సాటిలేదు



ఉద్యోగ విరమణ చేసిన ఎంటీఎస్ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఈఓ-1 సామల, ఉపాధ్యాయులు

బలిజిపేట: ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని, దానికి సాటిలేదని ఎంఈఓ–1 సామల సింహాచలం అన్నారు. మండలంలోని బర్లి యూపీ పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సూర్యనారా యణను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన తరువాత కూడా సమాజంలో గౌరవప్రదంగా కనిపించే వ్యక్తి ఉపాధ్యాయుడు మాత్రమే అని అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తరువాత సమాజానికి, విద్యకు సేవలు అందించగలిగిన ఏకైక వ్యక్తి ఉపాధ్యాయుడేనని తెలిపారు. చిత్తశుద్ధితో సేవలు అందించాలనే తపన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటుందన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు సూర్యనారాయణ దంపతులను దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూతపడిన అంగన్వాడీ కేంద్రాలు



వెంగళరాయిపురంలో మూతపడిన కేంద్రం

బలిజిపేట: అంగన్వాడీలు చలో విజయవాడ కార్యక్రమం నిమిత్తం వెళ్లడంతో మండలంలోని కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో చిన్నారులు కేంద్రాల వద్దకు వచ్చి తిరిగి వెళ్లిపోవాల్సి వచ్చింది. మండలంలో 94కేంద్రాలకు 92మంది అంగన్వాడీ టీచర్లు ఉన్నారు. 91మంది ఆయాలు ఉన్నారు. మూడు నుంచి 6సంవత్సరాల లోపు చిన్నారులు 785మంది ఉన్నారు. కేంద్రాలు మూతపడడంతో చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారం వారికి అందలేదు.

నారాయణపురం మీదుగా బలిజిపేటకు బస్సు వేయాలి



నారాయణపురం బ్రిడ్జిని పరిశీలించిన సీపీఎం నాయకులు

బలిజిపేట: పార్వతీపురం నుంచి నారాయణపురం మీదుగా బలిజిపేటకు బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు నారాయణపురం బ్రిడ్జిని సీపీఎం నాయకులు సోమవారం పర్యవేక్షించారు. నారాయణపురం బ్రిడ్జి పనులు పూర్తయి బ్రిడ్జి మీదుగా రాకపోకలు జరుగుతున్నాయని అయినప్పటికి ఆర్టీసీ బస్సును నడపకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బలిజిపేట నుంచి జిల్లా కేంద్రమైన పార్వతీపురం వెళ్లాలంటే బొబ్బిలి మీదుగా వెళ్లాల్సి వస్తోందని దీనివల్ల ప్రజలు వ్యయ, ప్రయాసలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు ఏదో పనిమీద పార్వతీపురం వెళ్తున్నారన్నారు. పార్వతీపురం డిపో మేనేజర్ దీనిని దృష్టిలో ఉంచుకుని బస్సును ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో జి.సత్యనారాయణ, మన్మథరావు, డి.త్రినాథ, ఆర్.సూరి తదితరులు పాల్గొన్నారు.